సాక్షి
పల్నాడు
శనివారం, 16, నవంబర్, 2024



రజత శంఖుచక్రాలు అందజేత

రేపల్లె రూరల్: రేపల్లె రైలుపేటలోని పట్టాభి రామస్వామి ఆలయంలో స్వామివారికి శైలజ- వెంకటేశ్వరరావు దంపతులు శుక్రవారం కిలో వెండి శంఖుచక్రాలను అందజేశారు.



గ్రామాల్లో సర్వే

ఫిరంగిపురం: మండలంలో శుక్రవారం కూడా ఎన్‌సీడీసీడీ సర్వే నిర్వహించారు. సిబ్బంది ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్, ఆర్బీసీ, క్యాన్సర్ పరీక్షలు చేసి యాప్‌లో నమోదు చేశారు.

పూజితకు బంగారు పతకం



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని కుమ్మరపాలెం గ్రామానికి చెందిన అంగటి పూజిత నున్న గ్రామంలో జరిగిన బాలికల కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించింది. నాగార్జునసాగర్‌లో 8వ తరగతి చదువుతోంది. జాతీయ పోటీల్లో పాల్గొననున్నది.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విభాగంలో ఇద్దరికి పదవులు



రేపాల శ్రీనివాసరావు



పడాల సాంబశివారెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురు నాయకులను పార్టీ పదవులలో నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా రేపాల శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పడాల సాంబశివారెడ్డిలను నియమించారు. వీరు పార్టీ అనుబంధ విభాగ కమిటీల నియామకం, ఆయా కార్యక్రమాల సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పోలీసు స్టేషన్లలో ఎస్పీ తనిఖీ

వెల్దుర్తి: పల్నాడు జిల్లా ఎస్పీ కె. శ్రీనివాసరావు శుక్రవారం వెల్దుర్తి, దుర్గి పోలీసు స్టేషన్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలాల్లో నాటు సారాను అరికట్టాలన్నారు. వెల్దుర్తి పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయని తెలియడంతో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. అన్ని కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని సూచించారు. అంతకుముందు పోలీసు స్టేషన్‌లలో రికార్డులను పరిశీలించి, సంతృప్తిని వ్యక్తం చేశారు. డీఎస్పీ జగదీష్, కారంపూడి, మాచర్ల సీఐలు టి. శ్రీనివాసరావు, నఫీజ్ బాషా, ఎస్ఐలు సమాందర్, వలి, సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

40,639 బస్తాల మిర్చి విక్రయం




కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 36,928 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,639 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,600 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 17,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 17,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 23,602 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

ఆంజనేయుడికి లక్ష తమలపాకుల పూజ



అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం ఉభయదాతలు, దేవస్థాన సిబ్బంది, అర్చకులు, ఏసీ తిమ్మనాయుడులు దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. తర్వాత స్వామి వారిని దర్శించుకున్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 3800 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 172 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 738 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 140 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 90 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 187 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 2180 క్యూసెక్కులు విడుదల చేశారు.

మార్మోగిన శివనామ స్మరణ



కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయాల్లో శివనామస్మరణ మార్మోగింది. భక్తులు తెల్లవారుజాము నుంచే పరమేశ్వరుడి ఆలయాలకు బారులుదీరారు. ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఎటు చూసినా కార్తిక శోభతో ఆలయాలు కళకళలాడాయి.



అమరేశ్వర ఘాట్‌లో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



స్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

అమరేశ్వరాలయంలో కార్తిక శోభ



అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రమైన అమరావతిలోని శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తిక శోభ కనిపించింది. పౌర్ణమి సందర్భంగా వేకువజాము నుంచే భక్తుల రద్దీ నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చిన పంచారామ క్షేత్ర సందర్శన భక్తులూ రావడంతో ఆలయం కిటకిటలాడింది. పవిత్ర కృష్ణా జలాలలో కార్తిక స్నానాలు చేసి, ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద కార్తిక దీపారాధన చేశారు. కార్తిక దామోదరునికి విశేష పూజలు నిర్వహించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాల చాముండేశ్వరి అమ్మ వారికి కుంకుమ పూజలు చేశారు. శివ పంచాక్షరి నామంతో ఆలయం మార్మోగింది. మధ్యాహ్నం వరకు భక్తులు దర్శనం కోసం పోటెత్తారు. ఉదయం సుమారు 70కిపైగా బస్సులలో పంచారామ క్షేత్ర సందర్శన యాత్రికులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖర శర్మ కార్తిక పౌర్ణమి విశిష్టతను వివరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో సునీల్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సీఐ ఎం.శ్రీనివాసరావు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కిక్కిరిసిన కోటప్పకొండ

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున స్వామికి విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. పంచామృతాలతో, విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం విశేష పుష్పాలంకరణ సేవ నిర్వహించారు. తర్వాత భక్తులను దర్శనానికి అనుమతించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఆలయంలో రద్దీ నెలకొంది. అయ్యప్ప మాలధారులు అధిక సంఖ్యలో తొలి పూజలో పాల్గొన్నారు. రావి చెట్టు, మహా నందీశ్వరుడు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట వద్ద కూడా భక్తులు పూజలు నిర్వహించారు. అభిషేక మండపంలో రద్దీ కనిపించింది. ఉచిత, శీఘ్ర, ప్రత్యేక, అభిషేక దర్శనాలు భక్తులకు కల్పించారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో రద్దీ ఎక్కువగా కనిపించింది. గిరిప్రదక్షిణలో ఉదయం 3 గంటల నుంచి భక్తులు పాల్గొన్నారు. పలు సంస్థలు భక్తులకు తాగునీరు, అల్పాహారం పంపిణీ చేశాయి. శివ నామ స్మరణతో ఆ మార్గం మార్మోగింది. గిరి ప్రదక్షిణ చేసిన వారిని ప్రత్యేక దర్శనానికి అనుమతించారు. మొక్కుబడి భక్తులు మెట్లపూజ ద్వారా కొండ మీదకు చేరుకున్నారు. ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసరావుపేట, చిలకలూరిపేట నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ద్విచక్ర వాహనాలు, కార్లలో భక్తులు కొండ మీదకు రావడంతో పార్కింగ్ స్థలం నిండిపోయింది. పోలీసులు రాకపోకలను క్రమబద్ధీకరించారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐలు కిశోర్, ప్రియాంకలు బందోబస్తు నిర్వహించారు.



కోటప్ప కొండలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వర స్వామి



క్యూలైన్‌లో రద్దీ



కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



పార్కింగ్‌లో భారీగా వాహనాలు

చేతికంది కన్నీరు తుడిచేనా..!

ప్రధాన పంటల సాగుకు ఖర్చు విపరీతంగా పెరగడం, రాబడి అంతంత మాత్రంగానే ఉండటంతో పల్నాడు జిల్లా రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపారు. ఈ కోవలో కంది సాగు గతంతో పోల్చితే రెట్టింపు అయ్యింది.



పిడుగురాళ్ల మండలం కామేపల్లిలో సాగైన కంది

- పత్తికి ప్రత్యామ్నాయంగా సాగు
- పెట్టుబడి తక్కువ కావడంతో అన్నదాతల మొగ్గు
- ప్రస్తుతానికి ఆశాజనకంగా పంట

సాక్షి, నరసరావుపేట: పత్తి సాగులో రైతులకు సవాలక్ష సవాళ్లు ఎదురవుతున్నాయి. పత్తి విత్తనాలు, ఎరువుల కల్తీ మొదలు, సాగు ఖర్చు అధికంగా ఉంటోంది. మరోవైపు వర్షాల ప్రభావంతో గులాబీ రంగు పురుగు బెడద అధికమైంది. చీడ, పీడలతో పత్తి దిగుబడి నానాటికీ తగ్గిపోతోంది. మరోవైపు ధరలు మార్కెట్‌లో అంతగా పలకడం లేదు. రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. దీంతో ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి పెడుతున్నారు. కొన్నేళ్లుగా పల్నాడు ప్రాంతంలో పత్తి సాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. కంది సాగుతోనైనా తమ వెతలు తీరుతాయని ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ కంది సాగు లక్ష్యం 19,259 హెక్టార్లు కాగా.. ప్రస్తుతం 26,509 హెక్టార్లలో సాగైంది. గతేడాది కంది పంట కేవలం 14,626 హెక్టార్లలోనే సాగైనట్లు లెక్కలు చెబుతున్నాయి

తక్కువ ఖర్చులు...

కంది పంట సాగుకు ఎకరాకు రూ.10-15 వేల మధ్య ఖర్చవుతుంది. ఇది మిగిలిన పంటలతో పోల్చితే చాలా తక్కువ. బెట్ట పరిస్థితులకు నిలబడే స్వభావం ఉంటుంది. డిసెంబర్, జనవరి నెలల్లో కోతకు వస్తుంది. కాయ దశలో తెగుళ్లు ఆశించకుండా పంటను కాపాడుకుంటే రైతులకు ఆదాయం వస్తుంది. హెక్టారుకు 10 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కంది పంటకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం 2022లో రూ.6,300, 2023లో రూ.7,000లు ప్రకటించగా... ఈ ఏడాది రూ.7,550 ఉంటుందని ప్రకటించారు. పల్నాడు జిల్లాలోని కీలకమైన వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, దుర్గి, నరసరావుపేట ప్రాంతాలలో దాల్ మిల్లులు అధిక సంఖ్యలో ఉన్నాయి. దీంతో వ్యాపారులు నేరుగా వచ్చి కొనుగోలు చేయడం రైతులకు కలిసి వస్తోంది.

రెట్టింపైన సాగు విస్తీర్ణం



గతంలో పత్తి పంటను అధికంగా సాగు చేసేవాడిని. కానీ అధిక వర్షాలు, గులాబీ రంగు పురుగు ఉధృతితో గిట్టుబాటు కాలేదు. దీంతో పత్తి సాగు తగ్గించా. గత ఏడాది రెండు ఎకరాల్లో, ఇప్పుడు రెట్టింపు స్థాయిలో నాలుగు ఎకరాల్లో కంది వేశాను. పెట్టుబడి తక్కువ , అధిక ఆదాయంతో పత్తి రైతులు కంది వైపు మొగ్గు చూపుతున్నారు.

– నంద్యాల వెంకటరెడ్డి, రైతు, కామేపల్లి

పెట్టుబడి తక్కువ



పత్తి పంటతో పోల్చితే కంది సాగుకు పెట్టుబడి చాలా తక్కువ. పైగా చీడ, పీడల బెడద కూడా తక్కువే. గత రెండు మూడేళ్లుగా కందికి గిట్టుబాటు ధర అనుకూలంగా ఉంటోంది. దిగుబడి సైతం ఆశించిన మేర వస్తోంది. దీంతో ఈ ఏడాది నేను 15 ఎకరాల్లో పంట సాగు చేశాను.

– బీరవలి రామిరెడ్డి, జూలకల్లు

బెల్లంకొండ మేజర్ కాలువకు గండి



నీటి ప్రవాహానికి దెబ్బతిన్న పంట

70 ఎకరాల్లో నీట మునిగిన వరి సాగు

బెల్లంకొండ: మండల పరిధిలోని నాగిరెడ్డిపాలెం గ్రామం వద్ద బెల్లంకొండ-ఎర్రబాలెం మేజర్ కాలువకు గండి పడింది. గురువారం రాత్రి కురిసిన వర్షం కారణంగా అధిక మొత్తంలో నీరు చేరింది. దాంతోపాటు కాలువలో పూడిక పేరుకుపోవడంతో దిగువకు నీటి ప్రవాహం తగ్గింది. శుక్రవారం తెల్లవారుజామున కాలువకు గండి పడింది. ఒక్కసారిగా నీరు రావడంతో సుమారు 70 ఎకరాలలో కోతకు వచ్చిన పైరు కొట్టుకుపోయింది. వారం రోజుల్లో కోతలు పూర్తయి ధాన్యం ఇంటికి వస్తుందని ఆశతో ఉన్న రైతులు బోరున విలపిస్తున్నారు. ఏడాది ఆరంభంలో నాట్లు వేశామని, గండి పడి మొత్తం పంట కొట్టుకుపోయిందని రైతులు పేర్కొన్నారు. తిరిగి నాట్లు వేసుకున్నామని, కోతకు వచ్చిన పంట నీట మునిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే కాలువకు గండి పడిందని, నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



నాగిరెడ్డిపాలెం వద్ద గండి

వైభవంగా తెప్పోత్సవం



అమరావతి: అమరావతి శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరుని తెప్పోత్సవం శుక్రవారం రాత్రి పవిత్ర కృష్ణా నదిలో అంగరంగ వైభవంగా సాగింది. కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవమూర్తులను ఊరేగించారు. స్థానిక అమరేశ్వర స్నానఘట్టంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉత్సవ మూర్తులను ఉంచారు. తొలుత కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దంపతులు సారె సమర్పించారు. అనంతరం కృష్ణా హారతి కార్యక్రమంలో ఏకాదశ హారతులను సమర్పించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక రచయిత పీసపాటి నాగేశ్వరశర్మ హారతి విశిష్టతను వివరించారు. మానవాళి జీవించటానికి పంచ భూతాలలో ఒకటైన నీటికి ప్రతి రూపమైన నదీమ తల్లులను పవిత్ర కార్తిక పౌర్ణమి నాడు పూజించటం శ్రేష్టమన్నారు. అనంతరం పడవను హంసవాహనంలా రంగురంగుల విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించి, అందులో బాల చాముండేశ్వరీ దేవి సమేత అమరేశ్వర స్వామి వారిని కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు చేసి కృష్ణా నది అలలపై కనులపండువగా తెప్పోత్సవం నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దివిస్ లేబొరేటరీస్ రూ.32 లక్షల వ్యయంతో నిర్మించిన జల ప్రసాద యూనిట్‌లను శుక్రవారం ప్రారంభించారు. ఆలయ చైర్మన్ రాజావాసిరెడ్డి మురళీకృష్ణ ప్రసాద్, ఈవో సునీల్ కుమార్, దివిస్ ప్రతినిధులు బి. కిషోర్ కుమార్, సి.హెచ్. శ్రీనివాసులు, రామకోటేశ్వర రావు, అనంత రామయ్యలతోపాటు స్థానిక టి.డి.పి. నాయకులు పాల్గొన్నారు.



వేడుకకు పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

క్లుప్తంగా

వైద్యుల కొరత నివారణకు చర్యలు



మాచర్ల రూరల్: అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యుల కొరత తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. పల్నాడు ప్రాంతంలోని వినుకొండ, మాచర్ల, గురజాల ప్రాంతాలలోని సిబ్బంది కొరత ఉందని పేర్కొన్నారు. వీటి భర్తీకి ప్రభుత్వానికి నివేదిక అందించగా.. 2వ మెడికల్ ఆఫీసర్‌ను ఇచ్చేందుకు అంగీకరించారని శుక్రవారం పేర్కొన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు పూర్తిగా అదుపులోకి వచ్చాయని వివరించారు. బీపీ, షుగర్, క్యాన్సర్ వంటి వాటిపై సర్వే జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, లెప్రసీ జిల్లా అధికారి మురళీ కృష్ణ, పీహెచ్‌సీ వైద్యులు వెస్లి, ఓరుగంటి ప్రవీణ్, ముక్తీర్ జాని, నిజాముద్దీన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవాలి



సత్రశాల (రెంటచింతల): శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తిక మాసంలో శివుడిని ఆరాధిస్తూనే పేదలను ఆదుకుంటే దైవానుగ్రహం లభిస్తుందని చిత్తూరు జిల్లా డిప్యూటీ కలెక్టర్ హరికృష్ణ అన్నారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని శైవక్షేత్రమైన సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానానికి శుక్రవారం ఆయన సతీసమేతంగా వచ్చారు. స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దానధర్మాలు గోప్యంగా చేస్తే ఎక్కువ ఫలితాలు ఉంటాయన్నారు. అన్నదాన కమిటీ సభ్యులను అభినందించారు. దంపతులను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా ప్రభురాజు నీలం మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మోదీ ప్రసంగాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, డీఎంహెచ్ఓ రవి తదితరులు

మాచర్ల రూరల్: గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని మోదీ తెలిపారు. వారి హక్కులు, భూముల కోసం పోరాడిన సమరయోధుడు, గిరిజన నాయకుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జన జాతీయ గౌరవ దివస్‌గా ఏటా నిర్వహిస్తామని శుక్రవారం ఆయన ప్రకటించారు. మాచర్ల మండలం బెల్లంకొండవారి పాలెం గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభకు హాజరైన గిరిజనులతో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. బిహార్ నుంచి ప్రధాని వీరితో ముచ్చటించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు పథకాల గురించి వివరించారు. ముందుగా గిరిజన బాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. గిరిజనుల 11 విభాగాలకు సంబంధించిన ప్రభుత్వ సంక్షేమాల గురించి ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ తిలకించారు. ఆదివాసీ లబ్ధిదారులకు పలు పథకాలు అందించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా గిరిజన సంక్షేమాధికారి వరలక్ష్మి, డీఈఓ చంద్రకళ, డీఆర్‌డీఏ బాలు నాయక్, డీఎంహెచ్ఓ రవి, ఐటీడీఏ రవీంద్రారెడ్డి, డీఎల్ఓ గబ్రూనాయక్, హౌసింగ్ పీడీ వేణుగోపాలరావు, ఆర్‌డీవో మురళీ కృష్ణ, జెడ్పీటీసీ మండ్లి మల్లుస్వామి, సర్పంచ్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ బూడిద మంగమ్మలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



షెడ్డు పనులను పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్ సునీత

నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్ పాలెం గ్రామాన్ని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ సునీత శుక్రవారం సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.2.30 లక్షలతో నిర్మిస్తున్న మినీ గోకులం నిర్మాణ పనులను పరిశీలించారు. సంబంధిత వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు 10 శాతం ఖర్చు భరిస్తే ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. బాలినేని రామాంజనేయులు నిర్మిస్తున్న క్యాటిల్ షెడ్ కూడా పరిశీలించారు. రైతు గుర్రం ఉపేంద్రకు చెందిన మునగతోట వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట నీటి యాజమాన్య సంస్థ జిల్లా పీడీ సిద్ధ లింగ మూర్తి, ఏపీడీ హీరంలాల్ నాయక్, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపారాణి, సర్పంచ్ కామినేని లలిత, పంచాయతీ కార్యదర్శి మధు, టీఏ రోశయ్య ఉన్నారు.

రణక్షేత్రానికి పల్నాటి దైవాలు



చెన్నకేశవ సన్నిధికి బయలుదేరిన పూజారులు

కారెంపూడి: పవిత్ర కార్తిక పౌర్ణమి నాడు చెన్నకేశవ స్వామి సన్నిధి నుంచి పల్నాటి వీరుల దైవాలు శుక్రవారం రాత్రి రణక్షేత్రానికి తరలివచ్చాయి. నృసింహస్వామి, చెన్నకేశవస్వామి, వెంకటాయపాలెం దైవం, మండలం దైవం, బాలచంద్రుని సామంతం రణక్షేత్ర నిధి మీదకు వచ్చాయి. ముందుగా చెన్నకేశవస్వామి ఆలయంలో నృసింహకుంతాన్ని వీరుల గుడికి తీసుకొచ్చారు. అక్కడ స్నానాదికాలు చేయించి పసుపుతో అలంకారం చేశారు. తర్వాత మరో నాలుగు ఆయుధాలను (దైవాలు) మాత్రం వెలుపలికి తీసి స్నానాదికాలు చేయించి అలంకరించారు. పల్నాటి చెన్నకేశవుని ఆయుధం, బ్రహ్మనాయుడి నృసింహకుంతం, బాలచంద్రుని సామంతం, వెంకటాయపాలెం దైవం, మండలం దైవాలను అలంకారాలు చేసుకుని వీరుల గుడి పూజారులైన పూజ గొల్లలు సంప్రదాయ డోలు సన్నాయి మేళంతో ఊరేగింపుగా చెన్నకేశవస్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామికి పూజలు చేశారు. అనంతరం చెన్నకేశవస్వామి ఆలయం ముందే ఉన్న నగరేశ్వరస్వామి ఆలయ ముఖద్వారానికి ఏర్పాటు చేసిన జ్వాలా తోరణం గుండా ప్రవేశించి పల్నాటి దైవాలు పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకున్నారు. అంతకు ముందే మహిళలు వేలాదిగా అంకాలమ్మ తల్లి, శివాలయం, చెన్నకేశవస్వామి ఆలయాలలో దీపాలు వెలిగించారు. అక్కడి నుంచి పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి వెళ్లి ఆయనను తోడ్కొని ఊరేగింపుగా వీరుల గుడికి చేరుకున్నారు. నృసింహకుంతాన్ని వీరుల గుడి ముఖ మండపంలో ఉన్న పోతురాజుకు ఎదురుగా నిలిపి పూజారులు పోతురాజుకు పడిగెం (ఆనకట్టు) కట్టారు. తరుణ్ చెన్నకేశవ పోతురాజుకు ధూపం వేసి కొబ్బరి కాయలు కొట్టి, నైవేద్యం అర్పించారు. రణక్షేత్రాన్ని వీడి వెళ్లవద్దని బ్రహ్మనాయుడు వేషంలో ఉన్న పీఠాధిపతి పోతురాజుకు ఆన పెట్టినట్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం పూర్తయ్యేటప్పటికి రాత్రి 12 గంటలు అయింది. ఈ నెల 30 నుంచి జరగనున్న పల్నాటి వీరారాధన ఉత్సవాలకు తరలి రావాల్సిందిగా వర్తమానాలు పంపుతామని పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ వివరించారు.

ప్రణాళిక ఉంటేనే విజయం



మాట్లాడుతున్న సుబేదార్ రేఖా రాయ్

నరసరావుపేట రూరల్: ప్రణాళికతో సిద్ధమైతే ఆర్మీ పరీక్షలలో విజయం సాధించవచ్చని 23వ ఆంధ్ర బెటాలియన్ ట్రైనింగ్ జేసీవో సుబేదార్ రేఖా రాయ్ తెలిపారు. ఫిబ్రవరిలో జరగనున్న బీ, సీ సర్టిఫికెట్ పరీక్షలకు హాజరయ్యే ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రేఖారాయ్ మాట్లాడారు. రోజువారీ ప్రణాళిక, నిత్యం చదవడం వలన ఆర్మీ, ఎన్‌సీసీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. రెండు సంవత్సరాలుగా బెటాలియన్ పరిధిలో క్యాడెట్స్ కోసం శ్రమించి బదిలీపై షిల్లాంగ్ డైరెక్టరేట్‌కు వెళ్తున్న రేఖా రాయ్‌ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ డి.సునీల్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం

గుంటూరు ఎడ్యుకేషన్: పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చెందుతుందని జిల్లా ఆడిట్ అధికారి బి.ధనలక్ష్మి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రదర్శనలో ఏర్పాటు చేసిన విజ్ఞానదాయక పుస్తకాలు, నవలలు, నిఘంటువులు, సాహిత్యం, జ్యోతిష్యం, పురాణాలతో కూడిన పుస్తకాలను పాఠకులు, విద్యార్థులు చదవాలని సూచించారు. సంజీవని పాలీక్లినిక్ డైరెక్టర్ ఆనెం సంజీవరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఎం. సీతారామయ్య పాల్గొన్నారు.

సోషల్ మీడియా యాక్టివిస్ట్ సుధారాణి దంపతుల అరెస్ట్

- పీటీ వారెంట్‌పై పాతపట్నం జైలు నుంచి తరలింపు
- న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచిన టూటౌన్ పోలీసులు
- రిమాండ్ విధించటంతో సబ్ జైలుకు తరలింపు
- బయటకు రాగానే మరో కేసులో అరెస్ట్ చేసేందుకు కుట్ర

నరసరావుపేట టౌన్: శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సబ్‌జైల్‌లో ఉన్న సోషల్ మీడియా యాక్టివిస్ట్ పెద్దిరెడ్డి సుధారాణి, వెంకటరెడ్డి దంపతులను పీటీ వారెంట్‌పై టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఆయన కుమార్తెలు, పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌లపై సోషల్ మీడియాలో అసభ్యకరంగా ఫొటోలు పెట్టి విద్వేషాలు రెచ్చగొట్టేలా రెడ్డిగారి అమ్మాయి ఫేస్‌బుక్ ఐడీతో పోస్టులు పెడుతున్న పెద్దిరెడ్డి సుధారాణిపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ పగడాల రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు ఈ నెల 6న కేసు నమోదు చేశారు. సుధారాణి దంపతులు అరెస్ట్ అయ్యి శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సబ్‌జైల్‌లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నట్లు తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడకు వెళ్లి పీటీ వారెంట్ దాఖలు చేశారు. కోర్టు అనుమతితో సబ్ జైలు నుంచి వారిని నరసరావుపేటకు తీసుకొచ్చారు. మొదటి అదనపు మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్ ఎదుట హాజరుపరచగా ఇద్దరికి రిమాండ్ విధించారు. వారిని స్థానిక సబ్‌జైలుకు తరలించారు. ఒక రోజు కస్టడీకి ఇవ్వాలంటూ టూటౌన్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

కొనసాగుతున్న అక్రమ కేసుల పరంపర..

పెద్దిరెడ్డి సుధారాణిపై నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిపై అసభ్యకర పోస్ట్ పెట్టినందుకు చర్యలు తీసుకోవాలని రావిపాడు గ్రామానికి చెందిన మల్లవరపు సింధు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. నాదెండ్ల పోలీస్‌స్టేషన్‌లో సుధారాణిపై మరో కేసు నమోదు అయినట్లు సమాచారం. టూటౌన్ పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు కాగానే.. రూరల్ పోలీసులు అరెస్ట్ చేయాలని భావిస్తున్నారు. ఒక కేసులో బెయిల్ రాగానే మరో కేసులో అరెస్ట్ చేసి సబ్‌జైల్లో ఎక్కువ రోజులు ఉంచేందుకు కుట్ర జరుగుతున్నట్లు తెలియవచ్చింది.

కాశీ విశ్వేశ్వరుని సేవలో జిల్లా ఎస్పీ



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు



నకరికల్లులో గిరి ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఎస్ఐ చల్లా సురేష్

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారిని పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ, ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు.

- స్థానిక కొండపై వేంచేసి ఉన్న శ్రీ చెంచులక్ష్మీ ఆదిలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, శ్రీ త్రిపురసుందరీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల తొలి గిరిప్రదక్షిణ ప్రారంభోత్సవంలో మాజీ మంత్రి కాసు కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకున్నారు. ఎస్ఐ చల్లా సురేష్ ప్రదక్షిణను ప్రారంభించారు. తహసీల్దార్ కె.పుల్లారావు ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి ఒకరు మృతి

పలువురికి తీవ్రగాయాలు



దండే సుబ్బారావు (ఫైల్)

గురజాల రూరల్: ఆటో బోల్తా పడి ఒకరు మృతి చెందగా.. పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... రెంటచింతల గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని దైద అమరలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు రెంటచింతల నుంచి ఆటో కిరాయికి మాట్లాడుకుని వచ్చారు. స్వామి వారిని దర్శించుకున్నాక తిరుగు ప్రయాణంలో కిలోమీటరు దూరం వెళ్లాక ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన దొండే సుబ్బారావు (37) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి పంపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబంలో వరుసగా విషాదాలు

రెంటచింతల: ఈ ప్రమాదంతో ఆరోగ్యపురంలో శుక్రవారం విషాదఛాయలు అలుముకున్నాయి. కాలనీకి చెందిన దండే సుబ్బారావు(38) అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. సుబ్బారావు మృతి చెందడంతో కుటుంబ సభ్యులతోపాటు కాలనీ వాసులు గురజాల ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. సుబ్బారావు కుమారుడు పార్థు చంద్ర గణేష్ 2019 ఫిబ్రవరి 7వ తేదీన ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్తున్న సమయంలో కారు ఢీకొని చనిపోయాడు. ఆయన సోదరుడు దండే వెంకటేశ్వర్లు కూడా కొంత కాలం క్రితం తిరుపతి దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. సుబ్బారావు స్థానిక బస్టాండ్ సెంటర్లో కట్టెల అడితి పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య లక్ష్మీప్రసన్న వ్యవసాయ కూలీ. ఆ ఇంట్లోని వారు రోడ్డు ప్రమాదాల్లో ఇలా మృత్యువాత పడుతుండటంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సుబ్బారావుకు భార్య లక్ష్మీ ప్రసన్న, మరో కుమారుడు వెంకట జయంత్ ఉన్నారు.

ఆనందం.. ఆహ్లాదం

గలగలా పారే సెలయేరులాంటి పసిపిల్లల నవ్వులు.. కోయిలమ్మల్లా మధుర కంఠాలతో ఆకట్టుకున్న బాలల గానామృతాలు.. పచ్చని ప్రకృతి ఒడిలో కొండల మధ్యన చెంగుచెంగున గంతులేసే లేడిపిల్లల్లా.. చిన్నారుల ఉరుకులు పరుగులు.. పురివిప్పి ఆడే నెమలి పిల్లల్లా అలరించిన బాల నాట్యమయూరాలతో వీవీఐటీ బాలోత్సవ్-2024 శుక్రవారం కోలాహలంగా ప్రారంభమైంది. చిట్టి చేతులు గీసిన అందమైన చిత్రలేఖనాలు అబ్బురపరిచాయి. తేటతెలుగు తియ్యని పద్యగానాలు వీనులవిందు చేశాయి. ఏకపాత్రాభినయాలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, విచిత్ర వేషధారణాలు ఆహూతులను కట్టిపడేశాయి.



నృత్య ప్రదర్శన దృశ్యం



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

- ఉత్సాహంగా ప్రపంచ తెలుగు బాలల పండుగ
- వీవీఐటీ బాలోత్సవ్-2024 అట్టహాసంగా ప్రారంభం
- తొలిరోజు పాల్గొన్న 13వేల మందికిపైగా విద్యార్థులు



పోటీలో చిన్నారులు

పెదకాకాని: తెలుగు జాతి గొప్పతనాన్ని గౌరవాన్ని ప్రపంచ నలుమూలలా చాటి చెప్పడానికి బాలోత్సవ్ దోహదపడుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చెప్పారు. ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్-2024 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రాంగణంలో శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గంట మోగించి ప్రారంభించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకతను, నైపుణ్యాలను వెలికితీసే అద్భుత ప్రయత్నం బాలోత్సవ్ అని కొనియాడారు. ఈ బాలోత్సవ్‌లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రతిభతో అంతర్జాతీయ యవనికపై తెలుగు కీర్తిపతాకను ఎగరేయాలని ఆకాంక్షించారు. తెలుగు జాతి సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలని సూచించారు. మాతృభాష గౌరవాన్ని నిలపాలని పేర్కొన్నారు. వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చిన్నారులు ఆనందంగా ఉంటే అందరూ సంతోషంగా ఉంటారన్నారు. మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగే పోటీల్లో ప్రతిభ చాటాలని చెప్పారు.

తొలిరోజు ఉత్సాహంగా..

తొలిరోజు శుక్రవారం 13 వేల మందికిపైగా చిన్నారులు వివిధ అంశాల్లో పోటీపడ్డారు. 20 అంశాలు, 61 విభాగాల్లో మూడు రోజులపాటు 30 వేదికలపై పండుగ వాతావరణంలో వేడుకలు జరగనున్నాయి. అనంతరం సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ప్రారంభ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కండె గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: మైనర్‌పై లైంగిక దాడి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ కె. నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రామిరెడ్డిపేటకు చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమ పేరుతో వంచించి సాయి నగర్‌కు చెందిన సాయిబ ఉరఫ్ సోను లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ సమయంలో తీసిన ఫొటోలను చూపి తన కోరిక తీర్చకుంటే సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరింపులకు దిగాడు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో నాలుగు రోజుల క్రితం వన్‌టౌన్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

రాజుపాలెం: సబ్జెక్ట్‌లు తప్పటం, ప్రేమ వ్యవహారాన్ని తల్లితండ్రులు నిరాకరించటంతో మనస్తాపానికి గురై నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె నుంచి శుక్రవారం రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్ సేకరించిన వివరాల ప్రకారం... బీఎస్సీ నర్సింగ్ మొదటి ఏడాది చదువుతున్న ఆమె శుక్రవారం కాలేజీలో టెర్రస్ మీద నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. వైద్యులు మెరుగైన వైద్యం అందించటంతో కోలుకుంటోంది. మానసిక సమస్యలతో ఆరు నెలల నుంచి మందులు వాడుతోంది. ఫస్ట్ సెమిస్టర్‌లో నాలుగు సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో ఇబ్బంది పడుతోంది. ప్రేమ వ్యవహారాన్ని తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో విశ్రాంత ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక చెంచుపేటలోని యూని హోమ్స్ అపార్ట్‌మెంట్‌లో నివసించే యార్లగడ్డ హనుమంతరావు(73) సివిల్ సప్లయిస్‌లో పని చేసి రిటైర్ అయ్యారు. ఇక్కడి అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివసిస్తున్నారు. పిల్లలు అమెరికాలో స్థిరపడ్డారు. శుక్రవారం రాత్రి తన బైక్‌పై కొలవరం నుంచి తెనాలి వస్తుండగా వీఎస్సార్ కళాశాల సమీపంలో లారీ ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందారు.